క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రావుపద్మ

ఎల్కతుర్తి: వేసవికాలం ప్రారంభమైన సందర్భంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు బీజేపీ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు జన్నారపు సురేందర్‌రెడ్డి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావుపద్మ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుండడంతో ప్రయాణికుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేసిన సరేందర్‌రెడ్డిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చాడ శ్రీనివాస్‌రెడ్డి, మండల నాయకులు కుడితాటి చిరంజీవి, జనగాని కిష్టయ్య, సదానందం, పృథ్వీరాజ్, మాచర్ల కుమార్, కొమురయ్య, ప్రకాశ్, శ్రీనివాస్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర జెండాతోనే పేదలకు న్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

శాయంపేట : ఎర్ర జెండాతోనే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అన్నారు. మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారు సర్వే నంబర్ 633లో సీపీఐ ఆధ్వర్యంలో ప్రభుత్వ భూమిలో నిరుపేదలు గుడిసెలు వేసుకొని 66రోజులు గడిచిన సందర్భాన్ని పురస్కరించుకొని శనివారం వంటావార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు బత్తిని సదానందం, అనుకారి అశోక్, అరికిల్ల దేవయ్య, క్రాంతికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి రాజేందర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


సాయం అందజేస్తున్న నరేందర్ స్నేహితులు

కమలాపూర్: కమలాపూర్ మండల కేంద్రానికి కోడెం నరేందర్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి 1997–98 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి స్నేహితులు రూ.17,516 నగదును సాయంగా అందజేశారు. శనివారం నరేందర్ దశదిన కర్మ సందర్భంగా ఈ మొత్తాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. కార్యక్రమంలో తోట రాజు, పసరగొండ నాగేందర్, పల్లె నరేందర్ రెడ్డి, చిదురాల శివకుమార్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణను వినియోగించుకోవాలి


శిక్షణను ప్రారంభిస్తున్న సర్పంచ్‌లు

శాయంపేట : భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తనయుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకుడు గండ్ర గౌతంరెడ్డి ఏర్పాటుచేసిన జీఎంఆర్‌ఎం ట్రస్ట్ ద్వారా యువతకు ఉచిత అందిస్తున్న డ్రైవింగ్ శిక్షణను వినియోగించుకోవాలని పత్తిపాక, కొప్పుల గ్రామాల సర్పంచ్‌లు చిట్టిరెడ్డి, గోలి మాధురిమహేందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మేకల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ తోట కుమారస్వామి, ఉపసర్పంచ్ అట్ల తిరుపతి, నాయకులు ఘంటా శ్యాంసుందర్‌రెడ్డి, చిట్టిరెడ్డి జైపాల్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు సామల మధుసూదన్ పాల్గొన్నారు.

భూపాలపల్లి రన్‌ను విజయవంతం చేయాలి

శాయంపేట : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జీఎంఆర్‌ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 12న అంబేడ్కర్ స్టేడియంలో ఉదయం 5గంటలకు నిర్వహించనున్న భూపాలపల్లి రన్ కార్యక్రమంలో వందలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5కే, 10కే, 21కే రన్‌లో ఉత్సాహవంతులైన యువతీ, యువకులు రిజిస్ట్రేషన్ చేసుకొని, పాల్గొని రన్‌ను విజయవంతం చేయాలని కోరారు.

తాటికల్లు మస్తుగున్నది..!

- పోద్దాటి కల్లుపై యువత ఆసక్తి
- తక్కువ ఖర్చు – ఎక్కువ కిక్కు
- ఫోన్లలో ఆర్డర్లు.. మండువాలో విందులు

సండే స్పెషల్

ఎల్కతుర్తి: 'తాటికల్లు మస్తుగున్నది.. నీబాంచన్.. తాగుతుంటే మత్తుగున్నది..' అని తాటికల్లు గురించి ఓ సినీ కవి మంచి పాటనే రాసాడు.. అందుకు తగ్గట్టుగానే తరాలు మారినా కల్లు రుచి మాత్రం ఏమాత్రం తగ్గడంలేదు. గతంలో పెద్దలు వాడికపట్టి కల్లుతాగేవారు.. కానీ, ప్రస్తుత కాలంలో యువత బిజీ లైఫ్‌లో వీలుదొరికినప్పుడల్లా కల్లుతాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో స్నేహితుల పుట్టిన రోజు.. బంధువుల ఇళ్లలో వేడుకలు.. వీకెండ్ రోజులు ఇలా స్పెషల్ ఏదైనా పట్టణాల్లోని అధిక శాతం యువత కల్లు తాగేందుకు పల్లెబాట పడుతున్నారు. మద్యం ప్రియుల కోసం పట్టణాల్లో వైన్ షాపులు ఉన్నట్టే.. గ్రామీణ ప్రాంతాల్లో కల్లు మండువాలు ఉంటాయి. అయితే ఆరోగ్యంపై దృష్టి పెడుతున్న యువత ప్రకృతి ఒడిలో సహజసిద్ధంగా చెట్టు నుంచి వచ్చే కల్లు తాగేందుకు పల్లెటూరి బాటపడుతున్నారు. అయితే ప్రస్తుతం పోద్దాటి కల్లు సీజన్ కావడంతో సమయం దొరకడమే తరువాయిగా యువత తమకు పరిచయం ఉన్న గీత కార్మికులకు ఫోన్ చేసి కల్లు ఆర్డర్ చేస్తున్నారు. ఎల్కతుర్తి మండలంలోని గ్రామాలు హనుమకొండ జిల్లా కేంద్రానికి


కల్లు తాగుతున్న యువకుడు

కేవలం 17కిలో మీటర్ల దూరంలో ఉన్నాయి. ప్రతీ గ్రామంలో గీత వృత్తిపై అనేక మంది ఆధారపడి జీవిస్తున్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీలు చదివిన నిరుద్యోగ యువత కులవృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. దీంతో పట్టణానికి చెందిన వారు అనేకమంది కల్లు తాగేందుకు ఎల్కతుర్తి మండలంలోని పలుగ్రామాలను ఆశ్రయిస్తున్నారు.

తక్కువ ఖర్చు.. ఎక్కువ కిక్కు

ఒక మద్యం బాటిల్ ఖర్చుతో పదిమందికి సరిపడా పోద్దాటి కల్లు లభిస్తుంది. పోద్దాటి కల్లు రుచికరంగా.. కిక్కు ఇస్తుండడంతోపాటు కిడ్నీల్లో వచ్చే రాళ్లను కరిగించేస్తాయనే పలువురు వైద్యుల సూచనతో యువత ఎక్కువగా కల్లుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ కల్లు తాగడం వల్ల రుచి, కిక్కు, ఆరోగ్యం లభిస్తుండడంతో కల్లు మండువాల్లో యువత తాకిడి రోజురోజుకూ పెరుగుతోందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అయితే కల్లుతాగుతూ ఆరగించేందుకు సైతం అక్కడే ఆహార పదార్థాలు లభిస్తుండడం వల్ల సెలవు దినాల్లో కల్లు మండువాలు యువత తాకితో కిక్కిరిసిపోతున్నాయి.


చెట్టునుంచి కల్లు దింపుతున్న గీతకార్మికుడు

చదువుకున్నా.. తప్పడంలేదు



చదువుకున్నా సరైన ఉపాధి లేక కులవృత్తిని నమ్ముకొని తాళ్లు ఎక్కుతున్న. తాటిచెట్టు ఎక్కడం ప్రమాదమని తెలిసినా ఉపాధికోసం తప్పడం లేదు. ప్రభుత్వం గీత కార్మికులకు తాటిచెట్టు ఎక్కే పరికరాలను ఉచితంగా అందజేయాలి.

– తీగల నాగయ్యగౌడ్, వీరనారాయణపూర్

నాణ్యమైన కల్లు పోస్తున్నాం



కస్టమర్లకు రుచికరమైన, నాణ్యమైన కల్లును అందిస్తున్నాం. కస్టమర్ల వద్ద మంచి పేరు సంపాదించుకొని వారు తిరిగి మరలా వచ్చేందుకు సౌకర్యాలు కల్పిస్తున్నాం. ఫోన్ల ద్వారా ఆర్డర్ చేసిన వారికి ముందస్తుగా కల్లు కేటాయించడం జరుగుంది.

– కుర్ర ప్రకాశ్‌గౌడ్, సూరారం

విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

ఎల్కతుర్తి: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో అధ్యాపకుల పాత్ర కీలకమని మండల విద్యాధికారి అప్పని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామంలోని ఎస్‌ఆర్‌కే పాఠశాలలో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ పాఠశాల ప్రిన్సిపాల్ కాశిరెడ్డి ఆదిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థికి ప్రాథమిక దశలోనే చదవడం, రాయడం నేర్చుకోవాలని సూచించారు. అప్పుడే ఉన్నత చదువుల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందన్నారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ కోటీశ్వర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ స్థాయి విద్యనందించడంలో ఎస్‌ఆర్‌కే పాఠశాల ముందంజలో ఉండడం అభినందనీయమన్నారు. అనంతరం కరికులంలో బెస్టు టీచర్ ట్రైనింగ్ పొందిన అధ్యాపకులకు అకాడమీ సర్టిఫికేట్స్ అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు కృష్ణ, రాజు, కవిత, శ్వేత, స్వాతి, స్రవంతి, మానస, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల కృత్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

కేర్ కళాశాలలో జాతీయస్థాయి సెమినార్

దామెర: కేర్ కళాశాలలో జాతీయస్థాయి సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, సెక్రెటరీ డాక్టర్ డి. సుధీర్‌కుమార్ వెల్లడించారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని కేర్ ఫార్మసీ కళాశాలలో శనివారం జాతీయ సెమినార్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన సెమినార్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 13న సోమవారం బయో అనాలిటికల్ మెథడ్ డెవలప్‌మెంట్, చాలెంజెస్ ఇన్ డ్రగ్ డిస్కవరీ అనే అంశంపై సెమినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ ఫార్మస్యూటికల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ టివి. నారాయణ, కామన్‌వెల్త్ ఫార్మసిస్టు అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ రావు వడ్డమూడి, జీనీరా ఫార్మ కంపెనీ సీఈఓ డాక్టర్ శ్రీనివాస్ ఆరుట్ల, స్పెషల్ గెస్టుగా నంది పురస్కార అవార్డు గ్రహీత, ప్రముఖ జానపద గాయకుడు, తెలంగాణ ఉద్యమ రచయిత మిట్టపల్లి సురేందర్ హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు.

ఈ సదస్సులో సుమారు రెండు వేల మంది ఫార్మసీ విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. సెమినార్‌కు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని సుధీర్‌కుమార్ కోరారు. ఆయన వెంట డాక్టర్ రఘునందన్, అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.


వాల్ పోస్టర్ విడుదల చేస్తున్న యాజమాన్యం

ఎఫ్‌ఎస్‌సీఎస్ మార్ట్ ప్రారంభానికి సన్నాహాలు


బెలూన్ ఎగురవేస్తున్న రవీందర్‌రావు

ఐనవోలు: నందనం రైతు సేవా సహకార సంఘం (ఎఫ్‌ఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో తొలిసారిగా నిత్యావసర వస్తువుల విక్రయశాల ఎఫ్‌ఎస్‌సీఎస్ మార్టు పేరిట నిర్వహించనున్నారు. మార్టు ఈ నెల 18న మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రారంభించనున్నట్లు సమచారం. కాగా, ముందస్తు సన్నాహాల్లో భాగంగా శనివారం వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మార్టు వద్ద సూచిక బెలూన్‌ను ఎగురవేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జన్ను కుమారస్వామి, సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి చందర్‌రావు, డైరెక్టర్లు వడిచర్ల శ్రీనివాస్, రాజారపు రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్, మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, బండి కంకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డిస్నీల్యాండ్‌లో స్వయంపరిపాలన


విద్యార్థులతో ఉపాధ్యాయులు

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని డిస్నీల్యాండ్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోటి విద్యార్థులకు పాఠాలు బోధించి నూతన అనుభూతిని పొందారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల ముఖ్య సలహాదారు దయ్యాల సదయ్య మాట్లాడారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలనిన్నారు. విద్యార్థి దశ ప్రతి ఒక్కరికీ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. క్రమశిక్షణ పట్టుదలతో చదివి రాబోయే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేష్‌భాను, దినేష్‌చందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

షకురాకు అవార్డు, ప్రశంస పత్రం

ఎల్కతుర్తి: కోవిడ్ సమయంలో ధైర్యంగా విధులను నిర్వహించిన భీమదేవరపల్లి మండలానికి చెందిన ఏఎన్‌ఎంకు అవార్డు లభించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం హనుమకొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్లారం సబ్‌సెంటర్‌లో ఏఎన్‌ఎమ్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ షకురా ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ చేతుల మీదుగా బెస్టు అవార్డుతో పాటు ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా షకురాను తోటి సిబ్బంది అభినందించారు. ఈసందర్భంగా షకురా మాట్లాడుతూ.. అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందజేస్తున్న వినయ్‌భాస్కర్

ఆ విద్యాసంస్థలను నిషేధించాలి


నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు


అండర్‌బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నయీంనగర్: జిల్లాలో పలు కార్పొరేట్ విద్యాసంస్థల యజమాన్యాలు విద్యను వ్యాపారం చేస్తున్నాయని, విద్యార్థులను వేధిస్తూ వారి ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలను నిషేధించాలని ఏఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. నయీంనగర్ సెంటర్‌లో ఏఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలను రద్దు చేయాలని శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో శ్రీచైతన్య, నారాయణ కళాశాలలు అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు తనిఖీలు చేయడం లేదని విమర్శించారు. చర్యలు తీసుకునేవరకు దశలవారీగా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కసరబోయిన రవితేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల పీఆర్వోలను తరిమికొట్టండి

ఖిలా వరంగల్: తెలంగాణ విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థలను నిషేధించాలని, అడ్మిషన్ల కోసం ఇంటికి వచ్చే పీఆర్వోలను తరిమికొట్టాలని ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను వేధిస్తూ ఆత్మహత్యలకు కారణమవుతున్న శ్రీచైతన్య, నారాయణ విద్యాసంస్థల బ్రాంచీలను సీజ్ చేయాలని, అనుమతి లేకున్నా కొనసాగుతున్న విద్యాసంస్థలను మూసివేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు రాకేష్, సురేందర్, చందన్, ప్రశాంత్, ప్రకాశ్ పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం


ఎల్కతుర్తి: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


ఐనవోలు: ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ, నాయకులు


పరకాలలో..

ఎల్కతుర్తి: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద గల హనుమకొండ- కరీంనగర్ ప్రధాన రహదారిపై బండిసంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు గొడిశాల సమ్మయ్యగౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత మహిళా నాయకురాలు అని చూడకుండా అనుచిత వ్యాఖ్యలు చేయయాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా నాయకురాలిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకొని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిన్ను జిల్లాలో అడుగుపెట్టనివ్వకుండా మహిళలు, నాయకులు తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తంగెడ మహేదర్, గొల్లె మహేందర్, ఎంపీటీసీ కడారి రాజు, జూపాక జడ్సన్, చిట్టిగౌడ్, వినయ్‌గౌడ్, సాతూరి శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి

ఐనవోలు: భారత్ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని కోరుతూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై వెంకన్నకు ఎంపీపీ మార్నేని మధుమతి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలు మహిళాలోకం తలదించుకునేలా ఉన్నాయని మండిపడ్డారు. మహిళలపై బండి సంజయ్ వ్యాఖ్యలు ఆయన సంస్కారానికి నిదర్శనం అని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో ఆడబిడ్డలకు అన్యాయం జరిగితే నేను అండగా ఉంటానని గవర్నర్ చెప్పారని, ఆమె స్పందన కోసం తెలంగాణ మహిళలు ఎదురు చూస్తున్నారన్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని ఆమె నివాసంలో మండల పార్టీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పోలెపల్లి శంకర్‌రెడ్డి, ఎంపీటీసీ కొత్తూరి కల్పన, బుర్ర రాజశేఖర్, వడిచర్ల శ్రీనివాస్, పరమేశ్, సతీష్, మహేందర్, వెంకన్న, రవి పాల్గొన్నారు.

సంజయ్ వ్యాఖ్యలపై ఆగ్రహం

పరకాల: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం పరకాల బస్టాండ్ కూడలిలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేసి ఆందోళన నిర్వహించారు. అనంతరం పరకాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిళ ప్రజాప్రతినిధి అనే గౌరవం లేకుండా అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మడికొండ శ్రీను, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండి సారంగపాణి, బీఆర్‌ఎస్ పట్టణ మహిళ అధ్యక్షురాలు కళావతి, మాధారం సొసైటీ చైర్మన్ నల్లెల లింగమూర్తి, కౌన్సిలర్స్ మడికొండ సంపత్ కుమార్, దామెర మొగిళి, ఏకు రాజు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సభను విజయవంతం చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యమకారులు

కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 12న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కాకతీయ యూనివర్సిటీ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చిర్ర రాజుగౌడ్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీ గేట్ ఎదురుగా ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ వాల్‌పోస్టర్లను శనివారం పలువురు ఉద్యమకారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిర్ర రాజు మాట్లాడుతూ ఉద్యమకారుల ఐక్యతను చాటి చెప్పాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కేయూ ఉద్యమకారుల ఫోరం కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్, బాధ్యులు డాక్టర్ మామిడిశెట్టి నాగరాజు పటేల్, రఘురాం, తుపాకుల రవి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం


పూజలో పాల్గొన్న భక్తులు, గ్రామస్తులు


పూజలు చేస్తున్న పండితులు

ఆత్మకూరు: మండలంలోని చౌళ్లపల్లిలో శనివారం హనుమాన్ ఆలయంలో ఆంజనేయస్వామి యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, పోచమ్మ, గ్రామదేవతల విగ్రహాలు, యంత్ర ప్రతిష్ఠలను యాజ్ఞికులు బీట్కూరి విజయసారథి ఆచార్యులు, ఆరుట్ల కేశవమూర్తి వేద మంత్రోచ్చరణలతో చేపట్టారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కంచ రవికుమార్, ఎంపీటీసీ బొమ్మగాని భాగ్యరవిగౌడ్, ఉపసర్పంచ్ పూజారి స్వప్న, ఎన్రెడ్డి లింగారెడ్డి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

నిత్యం లీకేజీలమయం

శాయంపేట: ఈ పక్క ఫొటోను చూస్తే వరదనీరు, మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తుందనుకుంటే పొరపాటు పడినట్లే. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో ఏర్పాటు చేసిన పైప్‌లైన్లు శాయంపేట– కొత్తగట్టు సింగారం బైపాస్ రోడ్డు మధ్యలో లీకేజీ కారణంగా తాగునీరు ఇలా రోడ్డుపై ప్రవహించడంతో శనివారం సాక్షి క్లిక్ మనిపించింది. వేసవిని దృష్టిలో పెట్టుకొని అధికారులు భగీరథ పైప్‌లైన్ లీకేజీలను అరికట్టి ప్రజలకు తాగు నీరు అందేలా చూడాలని కోరుతున్నారు.



ఉగాది తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐ శ్రీనివాస్

ఎల్కతుర్తి: ఆచార్య ప్రబోనంద యోగీశ్వర్ల ఆశీస్సులతో ముద్రించిన త్రైత సిద్ధాంత ఉగాది తెలుగు క్యాలెండర్‌ను స్థానిక సీఐ శ్రీనివాస్, ఎస్సై జక్కుల పరమేష్ శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆవిష్కరించారు. అనంతరం త్రైత సిద్ధాంతి జ్ఞానవేదిక కమిటీ అధ్యక్షుడు సదా నిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ ఉగాది పర్వదినం రోజు ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో దేవున్ని ఆరాధించాలని సూచించారు. తద్వారా భక్తితో పాటు జ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాణి, శివనారాయణ్ సింగ్, రేవతి, సుమన్, కల్యాణి, వెంకట్, కల్పన, లింగమూర్తి, సుధాకర్‌రావు పాల్గొన్నారు.